

మాగుంట కుటుంబానికి తీరని శోకం

- అనారోగ్యంతో మాజీ ఎంపీ పార్వతమ్మ మృతి
- పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- నేడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



పార్వతమ్మ (ఫైల్)

జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న 'మాగుంట' కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మాగుంట పార్వతమ్మ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. చెన్నై నుంచి నెల్లూరులోని మాగుంట స్వగృహానికి చేరిన పార్వతమ్మ మృతదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాగుంట కుటుంబంతో ఉన్న తన అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో గురువారం పార్వతమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి.

- వివరాలు 7లో..

3 నుంచి టెట్

జిల్లాలో 4 కేంద్రాల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 25 : ఏపీ టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అక్టోబరు 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ గ్లోరీ కుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కావలి పీబీఆర్ విశ్వోదయ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, రూరల్‌లోని ఆయాన్ డిజిటల్ జోన్ కలిపి మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్స్, బ్లూటూత్, స్మార్ట్‌వాచీలు, ఇతర ఏ ఎలక్ట్రానిక్ గాడ్జెట్లనూ అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డులలో ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7893258325, 9441148062, 6305364463 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

హమ్మయ్య.. గుంతలు పూడనున్నాయ్!

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాకు రూ.3.4 కోట్లు.. గూడూరుకు రూ.4.69 కోట్లు

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. కొన్నేళ్ల నుంచి గుంతల రోడ్లతో నరకం అనుభవిస్తున్న ప్రజలకు త్వరలోనే ఉపశమనం లభించనుంది. ప్రజా జీవనంలో కీలకమైన రోడ్లను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం ఐదేళ్లపాటు గుంతలు కూడా పూడ్చలేదు. అయితే కూటమి ప్రభుతం అధికారంలోకి రాగానే ఈ గుంతల రోడ్లపై దృష్టి పెట్టింది. అత్యవసరంగా చేయాల్సిన పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. అధికారుల ప్రతిపాదనలను ఆమోదిస్తూ వర్షాకాలంలోపు గుంతలు పూడ్చేందుకు రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. కావలి, నెల్లూరు డివిజన్ల పరిధిలోని 170 కిలోమీటర్ల మేర రోడ్లపై ఉన్న గుంతల పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చనున్నారు. ఇక గూడూరు డివిజన్‌లోని రోడ్లు కూడా అత్యంత దారుణంగా మారిపోయాయి. గూడూరు- రాజంపేట రోడ్డు, గూడూరు-తూపిలిపాలెం రోడ్డు, గూడూరు-వరగలి రోడ్డు, ఓజిలి-గొల్లపల్లి రోడ్డు వంటి వాటిపై ప్రయాణం నరకంగా మారింది. ఈ డివిజన్‌లోని 14 ప్రధాన రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మరో రూ.4.69 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే టెండర్లు పిలిచారు. అక్టోబరులోపు టెండర్లతోపాటు అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసి నవంబరులో గుంతలు పూడ్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

డీఆర్‌డీఏ ఏపీఎంలకు బదిలీ ఉత్తర్వులు

నెల్లూరు (హరనాథపురం) : బదిలీలు పొందిన ఏపీఎంలు, సీసీలకు డీఆర్‌డీఏ ఏపీడీ రాజు బుధ వారం ఉత్తర్వులు అందచేశారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి ఏపీఎంలు, సీసీలు నెల్లూరు జిల్లాకు బదిలీపై వచ్చారు. అదే విధంగా నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు బదిలీ అయిన వారు కూడా ఉత్తర్వులు అందుకున్నారు. 44 మంది ఏపీఎంలకు, 83 మంది సీసీలకు, ఏడుగురు సీసీలకు ఏపీడీతో పాటు డీఆర్‌డీఏ హెచ్‌ఆర్ అధికారి సుధాకర్ బదిలీ ఉత్తర్వులు అందచేశారు.

'ఎక్సైజ్' డీసీగా శ్రీనివాసరావు

- పలువురు అధికారుల బదలీ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 25 : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా డిప్యూటీ కమిషనర్ కె హేమంత్ నాగరాజును ఒంగోలుకు బదిలీ చేసి ఆయన స్థానంలో విజయవాడ ఏపీఎస్‌బీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న టీ శ్రీనివాసరావును నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అసిస్టెంట్ కిమిషనర్ దయాసాగర్‌ను నెల్లూరు ఏసీగా నియమించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె నాగమల్లేశ్వరరెడ్డిని తిరుపతికి బదిలీ చేయగా, వెయిటింగ్‌లో ఉన్న ఎ శ్రీనివాసులు నాయుడును నెల్లూరుకు కేటాయించారు.

నాకూ ఓ పదవి!



నామినేటెడ్ పోస్టులపై ఉత్కంఠ

తొలివిడత జాబితా ప్రకటనతో పెరిగిన ఆశలు

మలివిడతలో స్థానం కోసం కూటమి నేతల ఎదురుచూపు

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సుముహూర్తం రానే వచ్చింది. నామినేటెడ్ పదవుల కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్న కూటమి నేతల్లో ఉత్కంఠ పెరిగింది. తొలి విడత జాబితాలో రాష్ట్ర కార్పొరేషన్ పదవులు భర్తీ చేయడంతో మలివిడతపై జిల్లా నేతల ఆశలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తమకూ ఓ పదవి దక్కాలని, ఆ శుభవార్త ఎప్పుడెప్పుడు తమ చెవినపడుతుందా? అని ఉవ్విళ్లూరుతున్నారు.

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, టికెట్లు త్యాగం చేసిన నాయకులు కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోపే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానని కూటమికి నేతృత్వం వహించిన చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో జిల్లా నేతల ఆశలు మరింత పెరిగాయి. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులకు ఎవరు అర్హులు అనే అంశంపై తెలుగుదేశం, జనసేన, బీజేపీలు పెద్ద ఎత్తున కసరత్తు చేశాయి. అర్హుల జాబితా తయారీలో తెలుగుదేశం పార్టీ కొత్త పద్ధతులను అనుసరించింది. సిఫార్సులకు దూరంగా, పార్టీకి విధేయత, ఎన్నికల్లో పనిచేసిన తీరు, నాయకులకు ప్రజల్లో ఉన్న పట్టు, నీతి నిజాయితీ... ఇలా చాలా అంశాలను ప్రామాణికంగా తీసుకుని వడపోసింది. పదవుల కేటాయింపులో సామాజిక సమతూకం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. ఇక పదవుల భర్తీ జరుగుతుందనగా విజయవాడ ఉప్పెన ముంచుకురావడంతో వాయిదా పడింది. పక్షం రోజులు చంద్రబాబు రేయింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నం కావడంతో నామినేటెడ్ పదవుల భర్తీ ఇప్పట్లో జరగదని ఆశావహులు నిరుత్సాహ పడ్డారు. అయితే ప్రకృతిపరంగా ఉత్పన్నమైన సమస్యలు, పాలనాపరంగా చేయాల్సిన సంస్కరణలు ఎన్ని ఉన్నా, పార్టీ కోసం శ్రమించిన దిగువశ్రేణి నాయకులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఎవరూ ఊహించని విధంగా మంగళవారం నామినేటెడ్ పోస్టుల తొలి జాబితాను ప్రకటించారు. వివిధ రాష్ట్ర కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు కీలకమైన వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, టిడ్కో ఛైర్మన్ పదవులతోపాటు ముగ్గురికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. దీంతో కూటమి నేతల్లో మళ్లీ ఆశలు పుంజుకున్నాయి.

కీలక పదవులు ఇవే...

జిల్లా పరిధిలో భర్తీ కావాల్సిన కీలక పదవులు నుడ, డీసీసీబీ, డీసీఎంఎస్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు, ఆలయాల పాలకమం డళ్లు మొదలైనవి. వీటి కోసం పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు. తొలి విడత జాబితా ప్రకటనతో ఇక మలివిడత జాబితాల వెల్లడికి ఎంతో కాలం పట్టదని సంబర పడిపోతున్నారు. సమయం దగ్గరపడిందన్న విషయం రూఢీ కావడంతో పదవుల కోసం చివరి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పోలేరమ్మ తల్లో..!

- వెంకటగిరిలో మొదలైన జాతర సంబరం
- అర్ధరాత్రి తర్వాత కొలువుదీరిన అమ్మవారి ప్రతిమ
- నేడు భక్తుల మొక్కులు.. దర్శనాలు



పోలేరమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

వెంకటగిరి, వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరిలో బుధవారం పోలేరమ్మ జాతర సంరంభం మొదలైంది. అమ్మవారి పుట్టింటివారైన కుమ్మరి వారు బుధవారం తెల్లవారుజామున పోలేరమ్మ ప్రతిమ తయారీ మొదలుపెట్టి.. సాయంత్రానికి పూర్తి చేశారు. ఆ ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా అక్కడే భక్తుల దర్శనార్థం ఉంచారు. అక్కడ్నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకీపై అమ్మవారికి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటికి రాత్రి 9.30-10.30 గంటల మధ్య తీసుకొచ్చారు. మరోవైపు పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెం చేరడతో ఘటుం కార్యక్రమం ముగిసింది. కాంపాళెం వద్ద అమ్మవారి అప్ప చెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు రాత్రి 11 గంటల సమయంలో పూజలు చేసి అక్కడ పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించి.. గాలిగంగల సారెలను ముగించారు. అక్కడ్నుంచి గాలిగంగలు బయలు దేరి జీనిగలవారి వీధిలోని చాకలింటికి చేరుకుని అమ్మవారి ముందు నిలిపారు. కోడి తలను నోటితో కొరికి అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరించారు. తద్వారా అమ్మవారి ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ జరిగి శక్తిస్వరూపంగా సిద్ధమవుతుందని స్థానికుల నమ్మకం. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన సప్పరంపై అమ్మవారిని కూర్చోబెట్టారు. తర్వాత కరెంట్ సరఫరా నిలిపేశారు. దివిటీల వెలుగులు, ఆసాదుల తప్పెట్లు, యువత చిందుల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో గురువారం తెల్లవారుజామున కొలువుదీర్చనున్నారు. బద్దె గొర్రెను బలివ్వడంతో తొలిరోజు జారత ముగిసింది.



జాతరలో నేడు

గురువారం తెల్లవారుజామున పోలేరమ్మ దేవస్థానం వద్ద కొలువు తీరిన అమ్మవారికి వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఇంటి ముంగిట జీవాలను బలిస్తారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి విరూపోత్సవం కోసం పూలతో అలంకరించిన రథం నగరినుంచి దేవస్థానం వద్దకు రావడంతో విరూపోత్సవం మొదలవుతుంది. పురవీధుల గుండా మల్లయ్య తోటలోని విరూప మండపం వద్దకు చేరుకోగా.. అమ్మవారి ప్రతిమను కత్తితో నరికి విరూపం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ తంతు అంతా అమ్మవారి ప్రతిమ తయారైన 24 గంటల్లో జరగాలన్నది ఇక్కడి ప్రజల నమ్మకం.

రూ.50 లక్షల విడుదల

తిరుపతి(కలెక్టరేట్): వెంకటగిరిలో జరుగుతున్న పోలేరమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.50లక్షలు విడుదల చేసింది. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకంటించిన నేపథ్యంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.50లక్షలు విడుదల చేయాలని జీవో జారీ చేసింది.

విషాదంలో 'మాగుంట' కుటుంబం

- మాజీ ఎంపీ పార్వతమ్మ కన్నుమూత ● ప్రముఖుల సంతాపం
- ప్రభుత్వ లాంఛనాలతో నెల్లూరులో నేడు అంత్యక్రియలు



పార్వతమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు, పక్కన మాగుంట శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'మాగుంట' కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ (77) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున చెన్నైలో మృతి చెందారు. మాజీ ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి సతీమణి అయిన పార్వతమ్మ.. భర్త మరణాంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లో కావలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. భర్త ఆశయాలకు అనుగుణంగా, రాజకీయాల పరంగా ఒంగోలు, కావలి ప్రాంతాల్లో పార్వతమ్మ తనదైన ముద్ర వేసుకున్నారు. కాగా పార్వతమ్మ భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం చెన్నై నుంచి నెల్లూరుకు తీసుకొచ్చారు. నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న నివాసంలో అభిమానుల సందర్శనార్థం మృతదేహాన్ని ఉంచారు. గురువారం మధ్యాహ్నం పార్వతమ్మ అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్‌లతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. కాగా పార్వతమ్మ మృతిపట్ల ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సంతాపం ప్రకటించారు. మాగుంట కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని, పార్వతమ్మ తన పట్ల చూపించిన అభిమానాన్ని వెంకయ్య గుర్తు చేసుకున్నారు. మాగుంట కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలానే రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలు కూడా పార్వతమ్మ మృతికి సంతాపం ప్రకటించారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల అభివృద్ధికి పార్వతమ్మ చేసిన కృషిని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సీవీ శేషారెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, మాదాసు గంగాధరం, నివాళులర్పించిన వారిలో ఉన్నారు. టీడీపీ నేత బీద రవిచంద్ర ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. కాగా మాగుంట పార్వతమ్మను చివరిసారి చూసేందుకు అభిమానులు, వారి సంస్థల్లోని ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

● కావలి అభివృద్ధి ప్రదాతగా..

కావలి : మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి పట్టణ వాసులను, ప్రముఖులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. జమీందారు కుటుంబంలో జన్మించినా ఒక సామాన్యురాలిగా పార్వతమ్మ అందరికీ అందుబాటులో ఉంటూ అభివృద్ధితోపాటు విస్తృత సేవలు అందించారు. 1996లో ఒంగోలు ఎంపీగా, 2004లో కావలి ఎమ్మెల్యేగా మాగుంట పార్వతమ్మ కావలికి అందించిన సేవలతో మంచి పేరు సంపాదించున్నారు. సోమశిల ఉత్తర కాలువను గుడి పాడు నుంచి రాళపాడు రిజర్వాయర్ వరకు పొడిగించి మెట్ట ప్రాంతాలాలైన జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల రైతులకు సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించారు. కావలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు చిన్నక్రాక రిజర్వాయర్ నుంచి భూగర్భ పైపులైన్ ద్వారా మంచినీరు అందించారు. అలాగే కావలిలో వెనుకబడిన వెంగళరావునగర్, పుల్లారెడ్డి నగర్ ప్రాంతాలకు రాజీవ్‌నగర బాట ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తెప్పించి, అభివృద్ధి చేసింది. ట్రంకు రోడ్డును నాలుగు లైన్ల సీసీ రోడ్డు నిర్మాణం పార్వతమ్మ కృషి ఫలితమే. కావలిలో పేదలకు నివాసగృహాల కోసం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సుమారు 6 వేలకు పైన ఇళ్లను ఆమె హయాంలోనే నిర్మింపజేశారు. కావలి ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మంచినీరు సరఫరా చేశారు. ప్రజలను తన వాహనంలో కార్యాలయాలకు తీసుకెళ్లి అధికారులు, సంబంధిత శాఖ మంత్రులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేవరకు వారిని వదిలేవారు కారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నా కావలితో పార్వతమ్మకు ఉన్న అనుబంధాలను కొనసాగించేవారు.

వరద బాధితులకు విరాళాలు



సీఎంకు చెక్కు అందచేస్తున్న గ్రోసు సుబ్బారావు, మురళీకృష్ణ



మంత్రి నారాయణకు చెక్కు అందిస్తున్న సమత నర్సింగ్‌హోం అధినేతలు



చిన్నారుల నుంచి విరాళం నగదు అందుకుంటున్న అపుస్మా నాయకులు

- మురళీకృష్ణ హోటల్స్ రూ.5లక్షలు
- విశ్వం స్కూలు చిన్నారులు రూ.2.05 లక్షలు
- సమత నర్సింగ్‌హోం రూ.1లక్ష

నెల్లూరు (రూరల్/వైద్యం/హరనాథపురం), సెప్టెంబరు 25 : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతో మంది దాతలు పెద్ద మనసుతో ముందుకు వస్తున్నారు. ప్రతిరోజూ సీఎం సహాయనిధికి విరాళాలందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. బుధవారం నెల్లూరు రూరల్ అల్లీపురం వద్దనున్న విశ్వం స్కూల్ చిన్నారులు రూ.2,05,001లను సీఎం సహాయ నిధికి అందించారు. ఈ మొత్తాన్ని స్కూల్ ఛైర్మన్ హరి కోటేశ్వరరావు నెల్లూరులోని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపస్మా) అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి కృష్ణారావుకు అందించారు. చిన్నారులు సేవా దృక్పథంతో విరాళాలు సేకరించడం అభినందనీయమని వారు కొనియాడారు.

● నెల్లూరులోని సమత నర్సింగ్ హోం అధినేతలు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాతమ్మ వరద బాధితుల సహాయార్థం రూ.1లక్షకు చెక్కును పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు బుధవారం అందించారు. విజయవాడ, గోదావరి ప్రాంతాల్లో వరద బాధితులకు చేయూతనందించాలన్న ఉద్దేశంతో విరాళమిచ్చినట్లు వెల్లడించారు.

● నెల్లూరులోని మురళీకృష్ణ గ్రూప్ హోటల్స్ అధినేతలు గ్రోసు సుబ్బారావు, గ్రోసు మురళీకృష్ణ విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షలకు చెక్కును బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందచేశారు. ఈ సందర్భంగా అఖిలగాండ్ల తెలికుల సంఘం సమస్యలను గ్రోసు సుబ్బారావు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

● కసుమూరు గంధ మహోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సోమిరెడ్డి సమీక్ష



ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 25 : కసుమూరు మస్తాన్ వలీ దర్గా గంధమహోత్సవ ఏర్పాట్లపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మలోలా, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్, సీఐ పోతుగుంట సుబ్బారావు, తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు, వక్ఫ్‌బోర్డు అధికారులు, అన్ని శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 29, 30, వచ్చే నెల 1వ తేదీల్లో జరిగే కసుమూరు గంధ మహోత్సవానికి దేశ నలమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గంధ మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కనుపూరు చెరువుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. తాగునీటి సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, వైద్య శిబిరాల నిర్వహణ, లైటింగ్ సౌకర్యం మెరుగుపరచడంతోపాటు భక్తుల సంఖ్యకు అనుగుణంగా బయో టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

జనసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



విఘ్నేశ్వర ఆలయం వద్ద జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 25 : దేశవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని, ఇందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన ఆవు నెయ్యి కలుషితానికి కారకులైన ప్రతి ఒక్కరిని శిక్షించాలని కోరుతున్నామన్నారు. లడ్డూ అపవిత్రం నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ నాయకులు బుధవారం వీఆర్సీ సెంటర్‌లో ఉన్న గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిషోర్ మాట్లాడుతూ హిందువుల ఆలయాలపై, విగ్రహాల మీద దాడి జరిగినప్పుడు లేవని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోరు, ప్రస్తుతం లడ్డూ ప్రసాదం విషయంలో లేస్తోందని విమర్శించారు. హిందూ సనాతన ధర్మానికి భంగం కలిగినప్పుడు హిందువులు మాట్లాడకపోతే ఎలా అని ప్రశ్నించారు. పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం దారుణమని, దానికి కారకుడైన గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, నాయకులు జమీర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు అధిగమించకుంటే ఇంటికే!



ఉదయగిరిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్



సీతారామపురం : టెన్త్ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ..

● సమీక్షలో అధికారులకు కలెక్టర్ హెచ్చరిక

ఉదయగిరి రూరల్/సీతారామపురం, సెప్టెంబరు 25: ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించకుంటే విధుల నుంచి తొలగించి ఇంటికి పంపడం తథ్యమని కలెక్టర్ ఓ.ఆనంద్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో పర్యటించారు. ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, దుత్తలూరు మండలాల ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షించారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాన్ని నెల రోజుల్లో 50 శాతం పూర్తి చేయకపోతే వేటు తప్పదన్నారు. ఈ ప్రాంతంలో బీడు భూములు అధికంగా ఉన్నాయని, రైతులు పండ్లతోటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. పంచాయతీల వారీ సమీక్షలో లక్ష్యాలను సాధించని ఉద్యోగులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

● **సీతారామపురంలో సుడిగాలి పర్యటన**

ఇక సీతారామపురంలోని బెస్తకాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అంగన్వాడీలోని పాలు, గుడ్లు, కంది పప్పులను తనిఖీ చేశారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించి పాఠ్యాంశాలు బోధించారు. కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం కావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పబ్బులేటి పల్లి పంచాయతీలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల వద్ద అర్జీలు తీసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం హైవే పనులను పరిశీలించి, పనులు ఎలా జరుగుతున్నాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి డ్వామా పీడీ బి.శ్రీనివాసులు, ఆత్మకూరు ఆర్డీవో మధులత, ఏపీడీ గాయత్రీదేవి, ఇన్‌చార్జి ఎంపీడీవోలు శ్రీనివాసరాజు, సంధ్యాలక్ష్మి, ఏపీవోలు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఈసీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఏఎస్‌పేటలో 29న గంధమహోత్సవం



దర్గాలోని సమాధులు

ఏఎస్‌పేట : ఆధునిక యుగంలోను మహిమ గల దర్గాగా హిందూ-ముస్లిం ఐక్యతగా చిహ్నంగా ఏఎస్‌పేటలోని నాయబ్ రసూల్ దర్గా నిలుస్తోంది. అలాంటి దర్గాలో ఈ నెల 29వ తేదీన గంధమహోత్సవం జరగనుంది. నెల్లూరుకు యాభై కి.మీ దూరంలోని ఏఎస్ పేట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ ఆయన సతీమణి హబీబాఖాతూన్ అమ్మవార్లతో ఉన్న దర్గా 17వ శతాబ్దంలో నిర్మించారు. అమ్మవారు మానసిక వైద్యురాలు కావడంతో ఈ దర్గాకు ప్రత్యేక విశిష్టత ఏర్పడింది. ఆనాటి నుంచి ఇప్పటిదాకా శరీరక, మానసిక రోగులు దర్గా ప్రాంగణంలో మూడు రోజులు నిద్రిస్తే చాలు ఆరోగ్యం కుదుటపడుతుందన్న నమ్మకం భక్తుల్లో ఉంది. ప్రతిరోజు రాత్రి దర్గాలో నీరు ఉంచి ఉదయం భక్తులకు పంపిణీ చేస్తారు. ఈ నీరు తాగడం ద్వారా సర్వరోగాలు నయం అవుతాయని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా దేశం నలుమూలల నుంచి వందలాది భక్తులు ఇక్కడకు వస్తుంటారు. కాగా, ఆదివారం గంధమహోత్సవం సందర్భంగా నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సెలవు దినం కావడంతో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్పొరేషన్ ఎస్‌ఈ సంపత్‌కు తాకీదులు

- రేపల్లె ఈఈగా ఉన్నప్పటి అవకతవకలపై ప్రభుత్వం సీరియస్
- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 25 : నెల్లూరు కార్పొరేషన్ ఎస్‌ఈగా పని చేస్తున్న టీ సంపత్ కుమార్ ఎక్కడ పని చేసినా ఆరోపణలు ఎదుర్కోక తప్పడం లేదు. గతంలో గుంటూరు జిల్లా రేపల్లె మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఈఈగా పనిచేసేటప్పుడు సీసీ రోడ్ల నిర్మాణంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు చార్జిమెమోతో కూడిన నోటీసులు జారీ చేసింది. సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకా లిచ్చి సదరు కాంట్రాక్టరుకు అదనపు చెల్లింపులు చేశారని, అప్పట్లో ఈయనపైన ఆరోపణలు రాగా ప్రభుత్వం విచారణ జరిపింది. అందులో వాస్తవాలు తేలడంతో ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఈ నెల 20వ తేదీన నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందుకున్న 15 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా, ఎస్‌ఈ సంపత్‌పై నెల్లూరులోనూ పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాటిపై విజిలెన్స్ విచారణ కోరేందుకు కొందరు సిద్ధమవుతున్నారని సమాచారం.

సమర్థ్ కింద శిక్షణ పొందండి



శిక్షణ పొందిన మహిళకు బ్యాగు అందచేస్తున్న చంద్రియ చటర్జీ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 25 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమర్థ్ పథకం కింద శిక్షణ ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు పొందాలని సీఐటీఐ కార్యదర్శి చంద్రియ చటర్జీ పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులోని ఓ సమావేశ మందిరంలో ఆ పథకంపై శిక్షణ జరిగింది. ఆమె మాట్లాడుతూ నెల్లూరులోని సీఈఎస్‌ఈఎస్ శిక్షణ కేంద్రంలో టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు ఎక్కువ సంఖ్యలో వినియోగించుకోవాలని కోరారు. సీఈఎస్‌ఈఎస్ కేంద్రం అధినేత ఆంజనేయులు మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ ఇవ్వటమేకాక, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ వరప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి విజయవినీల్, ఏఎన్ యూజేకు చెందిన అమిత్ కుమార్, ఐఎస్ రావు, స్కోప్ సొసైటీకి చెందిన వారు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాపూరు, సెప్టెంబరు 25: రాపూరు పంచాయతీ పరిధిలోని సైదాదుపల్లి గ్రామానికి చెందిన పలుగోటి పెంచల నరసయ్య బుధవారం ఉదయం గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గుర్తించిన బంధువులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. వైద్యులు మృతదేహానికి పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సోమశిలకు 20,528 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, సెప్టెంబరు 25: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 20,528 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎంసీలు కాగా 52.594 టీఎంసీలకు చేరుకుంది. దిగువ డెల్టాకు 1000, కండలేరుకు 10,000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కల్లుగీత సొసైటీలకే మద్యం షాపులివ్వాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), సెప్టెంబర్ 25 : కూటమి ప్రభుత్వం గౌడ్ కల్లుగీత కార్మికులకు రిజర్వ్ చేసిన మద్యం షాపులను ఆయా ప్రాంతాల్లోని గౌడ్ కల్లుగీత సొసైటీలు మాత్రమే టెండర్లు వేసుకుని దక్కించుకునేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా కోస్తా ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణ గౌడ్ కోరారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం జరిగింది. రాధాకృష్ణ మట్లాడుతూ ధనికులు, ఆర్థికంగా వెసులు బాటు ఉన్న గౌడ్ కులస్తులు మద్యం దుకాణాల విషయంలో చొరబడకుండా, బినామీలకు తావు లేకుండా పాలసీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న గౌడ్ కల్లుగీత కార్మిక కుటుంబాల అభివృద్ధికి లైసెన్సు దారులకు ప్రభుత్వం ఉచితంగా మల్టీ ట్రీ క్లైంబర్స్‌ను ఏర్పాటు చేయాలని, లైసెన్సు దారులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. తాటి, ఈత, కొబ్బరి వనాలను పెంచుకునేందుకు ప్రతి కల్లు గీత సొసైటీకి ఐదెకరాల పొలాన్ని ఉచితంగా ఇవ్వాలని కోరారు. బీజేపీ నాయకులు కోసూరు బాలయ్య గౌడ్, కోసూరు వెంకట సుధీర్, తిరకాల శివాగౌడ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ చోరీ

కావలి రూరల్, సెప్టెంబరు25: మండలంలోని చౌదరిపాలెం సమీపంలోని వాగు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బుధవారం వెలుగుచూసింది. గ్రామస్థుల కథనం మేరకు, చౌదరిపాలెం నుంచి గన్నారపుగుంటకు వెళ్లే మార్గంలోని రోడ్డుకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను గుర్తు తెలియని దుండగులు దొంగిలించుకుపోయారు. పొలాల్లో లైన్లు దెబ్బతిని ఉండటంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దిమ్మెపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఒరగటంతో మరమ్మతులు చేయించి లైన్లు పునరుద్ధరించుకోవాలని రైతులు భావించారు. ఇంత లోనే రాగి తీగ చోరీ జరిగింది.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

పొదలకూరు : పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో మద్యం అక్రమ విక్రయాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హనీఫ్‌కు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా 28 మద్యం సీసాలతో సహా శ్రీనివాసులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ఇలియాజ్, సుబ్బారావు, రమేష్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పట్టుకున్న మద్యం సీసాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7266
వెండి కిలో ధర	రూ. 93,500
వెండి ఒక గ్రాము	రూ. 96.50

ఎన్‌ఎంసీ టీపీఆర్వోగా బాలకృష్ణ



బాలకృష్ణ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 25 : నెల్లూరు కార్పొరేషన్ టీపీఆర్వో(టౌన్‌ప్లానింగ్ రీసోర్సు ఆఫీసర్)గా డబ్బుగుంట బాల కృష్ణను నియమిస్తూ కమిషనర్ సూర్యతేజ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం ఆయన నగర పాలక సంస్థలో సూపరింటెండెంట్ హోదాలో పని చేస్తున్నారు. గతంలో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ కమిషనర్‌గా ఏడాది కాలం పని చేసి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరుకు బదిలీపై వచ్చారు. తాజాగా టీపీఆర్వోగా నియమితులయ్యారు.

అసైన్డ్‌భూముల రికార్డుల పరిశీలన

మనుబోలు, సెప్టెంబరు 25: ఇటీవల అసైన్డ్‌భూములను ఫ్రీహోల్డ్ చేయడంతో అందుకు సంబంధించిన రికార్డులను ప్రత్యేక కలెక్టర్ హసీఫా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇనాం, చుక్కలు, అసైన్‌మెంట్ భూములకు సంబంధించి 2003కు ముందు పట్టాలు ఇచ్చినా వాటిని హోల్డ్‌లో ఉంచారన్నారు. 2023లో గత ప్రభుత్వం ఆదేశాలతో వాటిని ఫ్రీహోల్డ్‌గా మార్చారన్నారు. అంటే భూములకు అమ్ముకునే వెసులుబాటు కల్పించారన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఫ్రీహోల్డ్ చేసిన భూముల రికార్డులను పరిశీలిస్తున్నామన్నారు. ఫ్రీహోల్డ్ విధానం సక్రమంగా చేశారా, లేదా అన్నది నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో 1878సర్వే నెంబర్లలో 2415 ఎకరాలు ఉన్నాయని, వీటికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారన్నారు. దీనిపై మరో వారంరోజుల్లో పరిశీలన ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, డీటీ బషీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



కావలి : దీన్‌దయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, సెప్టెంబరు 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నమస్కార్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షత వహించగా నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, సుందర్‌శెట్టి సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

●**జలదంకి:** పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం జలదంకిలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు వంటేరు రాకేష్‌రెడ్డి, ముడి కిషోర్‌రెడ్డి, కమతం బాలకోటయ్య, గణాది మహేష్‌లు పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జంపాని ప్రసాద్, ఎస్టీ మోర్చా నేత సముద్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దుత్తలూరు సెంటర్‌లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు చుండి హరిగోపాల్‌రెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, అందే రామయ్య, పసల కృష్ణ, లెక్కల వెంకటరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నందిగుంట స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక ఇరిగేషన్ అతిథి భవనంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకు విజయలక్ష్మి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అరాచక పాలన : ఎమ్మెల్యే కాకర్ల



వరికుంటపాడు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



లింగసముద్రం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వరికుంటపాడు, సెప్టెంబరు 25: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోనూ అరాచక పాలన సాగిందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. బుధవారం వరికుంటపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో సతీమణి కాకర్ల ప్రవీణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 600 మంది రైతుల భూములను బలవంతంగా లాక్కొన్న ఘనత ఆపార్టీ వారికే దక్కుతుందన్నారు. అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. తిమ్మారెడ్డిపల్లి-గణేశ్వరాపురం రహదారితోపాటు కాకొల్లువారి పల్లి గ్రామానికి సైతం రహదారి నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే భోగ్యంవారిపల్లిలో రహదారికి అడ్డుగా నిర్మించిన ఇంటి ప్రహరీని కూల్చివేసేందుకు చర్యలు చేపడతానన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడి వాటర్‌ప్లాంట్ల నిర్మాణం చేపడతానన్నారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణాలు పూర్తి చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి మీదుగా ర్యాలీ చేపట్టి ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందించి స్టిక్కర్లు అంటించారు. తొలుత పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కంది, దోస పంటలను పరిశీలించి వ్యవసాయం లాభసాటి చేసి రైతులను ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతిచెందడంతో మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారాయణ, సర్పంచ్ దిలీప్‌కుమార్, నాయకులు పొద మాధవరావు, పేరం సుధాకర్‌రెడ్డి, నాదిండ్ల రాజేంద్ర, తెల్లగొర్ల వెంకటయ్య, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఏడీఏలు శేషగిరి, చెన్నారెడ్డి, ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనను ఆదరించండి : ఇంటూరి

లింగసముద్రం : కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి, వందరోజుల పాలన గురించి వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు తిరుమణిశెట్టి కోటయ్య మందిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆయన్ను మేళతాళాలతో గుర్రంపై ఊరేగించారు. తదుపరి ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని 14 డ్వాక్రా సంఘాలకు రూ2.48 కోట్ల రుణాలను పంపిణీ చేశారు.అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఏపీఎం కే సింహాద్రిరావు, టీడీపీ నాయకులు వేముల గోపాలరావు, అడపా నర్సయ్య, మాజీ ఎంపీపీ కల్పన, సర్పంచు పులి రాఘవులు, జనసేన నాయకులు కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

●**ఆత్మకూరు:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా అడుగులు వేసిందని, రానున్న మంచి రోజులకు పునాది ఈ వంద రోజుల పాలనే నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు తెలిపారు. బుధవారం ఆత్మకూరు మండలం కరటంపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను, స్టిక్కర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, బీజేపి నాయకుడు ఉప్పలూరు నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** తిక్కవరంలో బుధవారం జరిగిన ఇంది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎన్డీసీసీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కర పత్రాలు పంచారు. అనంతరం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా సీఎం చంద్రబాబు నెరవేర్చుకుంటూ వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మర్రిపాడు మండల అధ్యక్షులు ఆరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, ఎంపీడీవో నగమణి, ఎంఆర్వో స్వప్న, మండల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆత్మకూరు, సెప్టెంబరు 25: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మండలంలోని మహి మలూరు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు తేజ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

ఆత్మకూరు, సెప్టెంబరు 25: హెచ్‌ఐవీపై యువత అవగాహన కలిగి ఉండాలని సార్ఫ్ సంస్థ పీఎం జెనోమీ, పలువురు వక్తలు తెలిపారు. బుధవారం పట్టణం లోని ప్రియదర్శిని కాలేజీలోని విద్యార్థులకు, నెల్లూరు పాళెంలోని పొదుపు మహిళలకు, ఆటోస్టాండ్ కార్మికులకు సార్ఫ్ సంస్థ ఆత్మకూరు, కావలి విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ప్రియదర్శిని కాలేజి ప్రిన్సిపాల్ వి శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సార్ఫ్ సంస్థ సిబ్బంది కవితప్రియ, సునంద తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

మండలంలోని 22 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ షేక్ సంధాని, జేవీవీ నాయకులు ఎస్ మురళీకృష్ణ, ఓ మల్లికార్జున, హెచ్‌హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వార్డులు, రక్త పరీక్షల, మందుల గదులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనీషా, ఠాగూర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



సభలో మాట్లాడుతున్న కన్నమనాయుడు

బిట్రగుంట, సెప్టెంబరు 25: అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలసికట్టుగా పని చేసిన వుడే అభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీ సీఈవో కన్నమనాయుడు అన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటసుబ్బా రావు ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, భద్రత, రవాణా సౌకర్యం, పరిశ్రమల స్థాపన, తీరప్రాంతాల అభివృద్ధి ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినపుడే స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు పీ.అనిత, టీడీపీ నేత ఎం.నాగేశ్వరావు, ఏవో గోవిందరావు, విస్తరణాధికారి జహీర్‌బాష, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ గ్రామాల అభివృద్ధిలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో గ్రామాల అభివృద్ధికి ప్రజలు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సామ్రాజ్యం, కల్పన, రమణమ్మ, ఉపసర్పంచ్ ముర్తుజా, ఈవోపీఆర్డీ కరీముల్లా, పంచాయతీ కార్యదర్శులు అమర్నాథ్‌రెడ్డి, చినబాబు పాల్గొన్నారు.

దుత్తలూరు : దుత్తలూరు పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-2047 విజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీముల్లా, నాయ ుకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, వెంకటేశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఎం

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె అజయ్ కుమార్ కోరారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఫలితంగా ఈప్రాంతంలోని పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ రిజర్వాయర్లు ముందుకు సాగలేదన్నారు. దశాబ్దాలుగా ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. అధ్వాన్నంగా ఉన్న ఉదయగిరి-నందవరం రహదారిపై రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, మల్లికార్జున, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, తిరుపతయ్య, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: మండలంలోని సున్నవారిచింతల గ్రామ సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. తిరుమలాపురం గ్రామానికి చెందిన అలూరి వెంకటేశ్వరరెడ్డి ఉదయగిరికి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సున్నంవారిచింతల గ్రామ సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారు చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు తరలించారు.

స్కూల్ గేమ్స్ పోటీలు, ఎంపికలు

కావలిటౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని జడ్పీ క్రీడా మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గస్థాయి పోటీలు, ఎంపికలు జరిగాయి. డిప్యూటీ డీఈవో రఘురామయ్య పాల్గొని పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి నియోజకవర్గ జట్లకు ఎంపిక చేశారు. గురువారం గేమ్స్‌తో పాటు అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు జడ్పీ పీడీ చిరంజీవి తెలిపారు. జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఎంఈవో-1 గోవిందయ్య ఎంఈవో-2 సుబ్బయ్య, హెచ్ఎం నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం నియోజకవర్గస్థాయి అండ్-14, 17 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను కన్వీనర్ తిరుపతయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారిని నియోజకవర్గ స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. వీరు నెల్లూరులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ట్రంకురోడ్డుకు పార్వతమ్మ పేరు

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి



మాగుంట పార్వతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు

కావలి, సెప్టెంబరు 25: మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ కృషితో కావలి ట్రంకురోడ్డు నాలుగు లైన్ల సీసీ రోడ్డుగా ఏర్పాటు అయినందున, ఆ రోడ్డుకు ఆమె పేరు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు త్వరలో కౌన్సిల్ తీర్మానం కూడా తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. మాగుంట పార్వతమ్మ(77) బుధవారం మృతి చెందటంతో కావలి టీడీపీ కార్యాలయంలో, ట్రంకు రోడ్డులోని బ్రిడ్జి సెంటర్‌లలో ఆమె సంస్మరణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని పార్వతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే నెల్లూరులోని మాగుంట నివాసంలో ఉన్న పార్వతమ్మ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతమ్మ మరణం రాజకీయ పార్టీలకు, కావలి ప్రజలకు తీరని లోటన్నారు. సామాన్య కార్యకర్త కోసం కలెక్టర్ నుంచి సీఎం వరకు వెళ్లి పని పూర్తి చేయటం ఆమె నైజమన్నారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేతలు పాల్గొన్నారు. అలాగే మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీకళాశాలలో, కావలి రెడ్‌క్రాస్ భవనంలో కూడా పార్వతమ్మ చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

●**ఉదయగిరి రూరల్:** మాగుంట పార్వతమ్మ మృతి పేదప్రజలకు తీరని లోటని టీడీ పీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల సంతా పాన్ని వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే, ఎంపీ పర్యటన రద్దు

●**అల్లూరు:** మండలంలోని ఇస్కపల్లిలో గురువారం నిర్వహించ తలపెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు మండల టీడీపీ నేతలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి కారణంగా ఈ కార్యక్రమాన్ని ఆపివేశామని తెలిపారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



నర్రా కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొల్లినేని

కొండాపురం, సెప్టెంబరు 25: మాజీ ఎంపీపీ నర్రా కాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు బుధవారం ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలసి కాంతమ్మ ఇంటికివెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కాంతమ్మ కుమారుల యిన ప్రసాదు, శివన్నారాయణ, పరమేశ్వరరావులను పరామర్శించారు.

సబ్ ట్రెజరీలో రికార్డుల పరిశీలన

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: స్థానిక సబ్ ట్రెజరీలో బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆడిట్ అధికారులు మోషే, యుగంధర్, నరేంద్ర ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లావాదేవీల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవో సీహెచ్ మమత, సీనియర్ అకౌంటెంట్లు బొమ్మతట్టు శ్రీహరి, కిశోర్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

జలదంకి, సెప్టెంబరు 25: మండలంలోని జలదంకి బ్రాహ్మణ క్రాక, కమ్మవారిపాలెం గ్రామాల్లో ఏవో శైలజ బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను వరి పైరులోకి తీసుకెళ్లి చీడపీడలు నివారణ, రసాయనిక ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** బోగోలు మండలం ముంగమూరు, ఏనుగులబావి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ శాఖాధికారిణి విజయలక్ష్మి ఆధ్వర్యంలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాడిరైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**వలేటివారిపాలెం:** మండలంలోని అయ్యవారిపల్లె, అంక భూపాలపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాదికారి హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. అయ్యవారిపల్లె, అమ్మపాలెం సర్పంచులు డేగా వెంకటేశ్వర్లు, చెన్నిబోయిన ఓబులుకొండయ్య రైతులు ప్రెగడ మోహన్‌కుమార్ చెంచు శ్రీనివాసులు, సిరిగిరి కొండారెడ్డి, బక్కమంతుల ప్రసాద్ పాల్గొన్నారు.

'దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: క్రైస్తవుల పవిత్ర గ్రంథమైన బైబుల్, ఏసుక్రీస్తు, పాస్టర్లను దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రిష్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు పాస్టర్లు బుధవారం సీఐ ఎస్ వెంకటరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఆరోన్, జాషువా, వై రవికుమార్, చెంచయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు

అనంతసాగరం, సెప్టెంబరు 25: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోతే చర్యలు తప్పవని ఎంఈవో 2 కే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బొమ్మవరం, అగ్రహారం, గుడిగుంట పాఠశాల లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం చేసి సిబ్బందికి సూచనలు చేశారు. చిన్నారుల పఠన సామర్థ్యాలు పరిశీలించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

అల్లూరు, సెప్టెంబరు 25 : మండలంలోని ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.హజరత్ పాల్గొని మాట్లాడారు. మండల అధ్యక్షుడు పీ చెంచయ్య, ప్రధాన కార్యదర్శి జీ ధనుంజయ్, మహేంద్ర కృష్ణ, మోహన్‌రావు, కృష్ణమూర్తి, గురవయ్య, సురేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

పదవికి న్యాయం చేస్తా : అనూరాధ

అల్లూరు, సెప్టెంబరు 25 : టీడీపీలో గిరిజన కార్యకర్తగా తాను చేసిన సేవను గుర్తించి తనకు ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కోఆపరేటివ్ మెంబర్‌గా ఎంపిక చేసిన ందుకు తిరువీధి అనూరాధ పార్టీనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అల్లూరులో బుధవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, ఈ పదవి ఇచ్చిన పెద్దల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. తన పదవికి న్యాయం చేస్తానన్నారు. గిరిజనుల అభ్యున్నతికి పాటుపడతానని తెలిపారు. పదవి దక్కేందుకు కృషి చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యాధికారి మృతికి సంతాపం

చేజర్ల, సెప్టెంబరు 25: స్థానిక పీహెచ్‌సి వైద్యాధికారి డా గిరీష్ బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా చేజర్ల పీఎచ్‌సి వైద్యురాలు డా. మొహబత్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అమృతధార వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, సెప్టెంబరు 25: పంచాయతీలోని సాతానువారిపాలెం, జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో వీపీఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఉదయం నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరిన్ సమస్య ఎక్కువగా ఉండడం వలన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఏక నాయకత్వం కింద అందరూ పనిచేయాలని ప్రభుత్వానికి, పార్టీకి మంచిపేరు తీసుకురావాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఎన్జీవో అసోసియేషన్ తరపున వెలుగోటి మధు ఎంపీ, ఎమ్మెల్యేలను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకట్‌రెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, గూడా నర్సారెడ్డి, జూపల్లి రాజా, వసంతరావు, సర్పంచ్‌లు చెరుకూరు రసూల్, సృజన, ఎంపీటీసీ భవానీ, ప్రసన్నరెడ్డి, అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష ఆర్థిక సాయం

మండలంలోని గుండెమడకల మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు గాలి నరసప్ప నాయుడు వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిల సమక్షంలో అందజేశారు. ఈమొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపం సుదర్శన్‌రెడ్డి, గురజాల వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●**లింగసముద్రం :** విజయవాడ వరద బాధితులకు పలువురు దాతలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ద్వారా విరాళాలు అందజేశారు.బుధవారం లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యేకు మండలంలోని టీడీపీ నాయకులు రాజారపు మాలకొండయ్య రూ.25,116, దేవకి సుబ్రహ్మణ్యం రూ.10,000, షేక్ రఫీ రూ.10,000, షేక్ కరీముల్లా రూ.10,000, సయ్యద్ మాబు రూ.10,000, షేక్ హమద్ రూ.10,000, సయ్యద్ నాయబ్ రూ.10,000, ద్రోణాదుల వెంకటేశ్వర్లు రూ.10,000, ఏ వెంకటేశ్వరరావు రూ.20,000 కలిపి మొత్తం రూ. 1,15,116లను అందించారు. ఎమ్మెల్యే దాతలను అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించాలి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, సెప్టెంబరు 25 : వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని మహిమలూరులో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రం, ఆరోగ్యవంతమైన సమాజం, అందరికీ విద్య, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర లక్ష్యాలను సాధించడానికి గ్రామసభల్లో ప్రజల నుండి వచ్చిన సూచనలను తీర్మానాల రూపంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.

'పొలం పిలుస్తోంది'పై సమీక్ష

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 25: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమం డిసెంబరు నెలాఖరు వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో ఏడీఏ చెన్నారెడ్డి, ఏవో ఆంజనేయులనాయక్, ఏఈవోలు భోగ్యం సుధీర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం లక్ష్యమని వ్యవసాయాధికారి శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు, సంగం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. వచ్చే రబీ సీజన్‌లో ఎంపిక చేసుకునే వంగడాల రకాలు, వాటి నాణ్యత, విత్తన శుద్ధి, తదితర అంశములపై వివరించారు. అదేవిధంగా వెటర్నరీ వైద్యాధికారి సురేష్, మత్స్యశాఖ అసిస్టెంట్ ప్రసన్నలక్ష్మి పశువులు, చేపల పెంపకంపై రైతుల వివరించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

దొంగతనాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ

ఆత్మకూరు, సెప్టెంబరు 25: బ్యాంకు దొంగతనాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధరరావు తెలిపారు. బుధవారం ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని పోలీసు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో అన్ని ప్రధాన విభాగాలు కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఆలారం సిస్టమ్ ఎల్లవేళలా పనిచేశాలా జాగ్రత్త వహించాలని సూచించారు. ఏటీఎంల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీని ఏర్పాటు చేసి 24 గంటలు ఉండేలా చూసుకోవాలని, ఏటీఎంలలో సైతం సీసీ కెమెరాలు బిగించాల్సి ఉందన్నారు. బ్యాంకులు తాము తెలిపిన సూచనలను పాటించకపోతే బ్యాంకులు, ఏటీఎంల వద్ద జరుగు దొంగతనాలకు బ్యాంకు అధికారులు బాధ్యత వహించవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐలు జిలానీ, సాయిప్రసాద్, పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన గోవా మద్యం : ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గోవా మద్యంతో ఎస్ఐ అంకమ్మ, సిబ్బంది

ఉలవపాడు, సెప్టెంబరు 25 : అక్రమంగా అమ్ముతున్న గోవా మద్యాన్ని పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, గుడ్లూరు మండలం మోచర్లకి చెందిన పచ్చిపాల వినోద్, కావలి మండలం ముసునూరుకి చెందిన అడపా మనోజ్‌కుమార్‌లు గోవా మద్యంను అక్రమంగా తరలించి, మండలంలోని చాకిచర్ల గ్రామం హైస్కూల్ వద్ద అమ్మేక్రమంలో వారి వద్ద నుంచి 93 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తీసుకొచ్చి విచారించగా నెల్లూరుకి చెందిన బుజ్జి అలియాస్ అబ్దుల్ అజీజ్ అమ్మమని ఇచ్చినట్లు చెప్పారని, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఎస్ఐ వివరించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించనట్లు ఆయన తెలిపారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

పొదలకూరు, సెప్టెంబరు 25: పట్టణంలోని స్కానింగ్ కేంద్రాలను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశాల మేరకు వైద్యాధికారులు తనిఖీ చేశారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని స్కాన్ సెంటర్‌ను, వీఎస్‌ఆర్ హాస్పిటల్, ఆర్‌ఆర్ హాస్పిటల్, వాణీ నర్సింగ్ హోమ్, కృష్ణ చైతన్య హాస్పిటల్‌లోని స్కానింగ్ సెంటర్లను డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పిఎల్ దయాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాన్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, ఆరోగ్య విస్తరణ అధికారి కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాపూరు తహసీల్దారుగా నరసింహ

రాపూరు, సెప్టెంబరు 25: రాపూరు మండల నూతన తహసీల్దారుగా పీఎల్ నరసింహ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తోటి ఉద్యోగస్తులదరూ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పనితీరుపై కరపత్రాల పంపిణీ

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వెంకన్నపాలెం, కొత్తపాలెం, నరుకూరు, మల్లికార్జునపురం గ్రామాలలో ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాల గురించి ప్రజలకు కరపత్రాలు ద్వారా ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, ఎస్సీ సెల్ నాయకుడు చింత సీతారామయ్య, చేవూరు శ్రీనివాసులు, అన్నం శ్రీనివాసులు, అరకోటి వెంకటేశ్వర్లు, జీవ రత్నం, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా, బోయి భీమన్నల జయంతి

- విజేతలకు బహుమతుల పంపిణీ

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 25: మండలంలోని ఈదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నెల్లూరుజిల్లా సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సాహితీ కవులు గుర్రం జాషువా, బోయిభీమన్నల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు భాస్కరయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో వేదిక గౌరవ అధ్యక్షులు ఎం శ్రీనివాసులు, కార్యదర్శి జి కేశవులు, సాహితీ ప్రతినిధి వి మాధవరావు, తెలుగు ఉపాధ్యాయులు టి సుబ్రహ్మణ్యం, ఏ శ్రీనివాసులు, ఎస్‌కె షాకీర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

కోవూరు, సెప్టెంబరు25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి బాబు మాట్లాడుతూ న్యాయ వాదుల చట్ట సవరణ బిల్లు అమలులోకి వస్తే న్యాయ వాదులు కక్షిదారులకు సేవలందించడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. న్యాయవాదుల హక్కుల కోసం విధుల్ని బహిష్కరిస్తున్నట్లు ఆయన వివరించారు. గురు, శుక్రవారాల్లో కూడా విధుల్ని బహిష్కరిస్తున్నామని, కక్షిదారులు ఈ అసౌకర్యాన్ని మన్నించాలన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 25 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సహచరులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. మూడో మైలుకు చెందిన వైఎస్‌ఎం కృష్ణ 2009 బ్యాచ్ కానిస్టేబుల్. ఆయన ఇందుకూరుపేటలో పనిచేస్తూ గతనెలలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. సహచర కానిస్టేబుళ్లు ఆయన కుటుంబానికి రూ.1.77 లక్షల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జీ మస్తాన్, అరుణ్, సంతోష్, శివ, అల్లాభక్షు, మస్తాన్ పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవ నర్సులదే !

- జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి

నెల్లూరు(వైద్యం): ప్రపంచలోనే అత్యుత్తమ సేవగా నర్సింగ్ వృత్తిని గుర్తించటం జరిగిందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి తెలియచేశారు. బుధవారం సెంట్ జోసఫ్ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్సింగ్ విద్యలో మంచి మార్కులు సాధించిన వారికి నగదుతో పాటు పథకాలను ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీ ఇచ్చి సత్కరించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీ ఫౌండర్ డాక్టర్ గ్లోరి, కార్యదర్శి జయప్రకాష్, కోశాధికారి సిరి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అంటోని మేరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలు, వార్డుల్లో సభలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు25: మండలంలోని గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలోని వార్డుల్లో బుధవారం ఆయా కౌన్సిలర్లు, సచివాలయ అధికారులు, టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు గ్రామసభలు నిర్వహించారు. నగర పంచాయతీలోని 20వార్డుల్లో సభలు నిర్వహించారు. అవసరమైన అభివృద్ధిపై ప్రణాళికను సిద్ధం చేసుకునే దిశగా గ్రామసభలు నిర్వహించినట్టు నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నరసింహారావు తెలిపారు, ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, కౌన్సిలర్లు శివకుమార్‌రెడ్డి, వైష్ణవి, తాళ్ల నరసింహస్వామి, ఇన్‌చార్జి రామానాయుడు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘం ఓటర్ల జాబితా చట్టబద్ధంగా ఉండాలి

- జిల్లా సహకారశాఖాధికారి గురప్ప

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 25 : చేనేత సహకార సంఘాల ఓటర్ల జాబితాను చట్టబద్ధంగా తయారు చేయాలని జిల్లా సహకారశాఖాధికారి గురప్ప ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో చేనేత సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులతో ఆ ఎన్నికల ఓటర్ల జాబితాపై సమావేశం జరిగింది. ఎన్నికలకు ఓటర్ల జాబితా తయారీతోపాటు, అవసరమైన రికార్డులు సిద్ధం చేయడాన్ని గురప్ప వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టు

కోవూరు : జనవిజ్ఞాన వేదిక బుధవారం నిర్వహించిన చెకు ముకి టాలెంట్ టెస్టుకు మండల పరిధిలోని మండల పరిషత్, జడ్పీ హైస్కూళ్లలో విశేష స్పందన కన్పించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు టాలెంటు టెస్టుకు హాజరయ్యారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు విడివిడిగా పోటీల్ని నిర్వహించారు. పోటీల్ని జేవీవీ నాయకులు గౌస్‌బాషా, ఖాజావలి, చంద్రమౌళి తదితరులు పర్య వేక్షించారు.

మూడు రోజుల్లో గంధమహోత్సవం..

వసతులేవీ మరి!

- కసుమూరులో ఏటా భక్తులకు తప్పని అవస్థలు
- ముజావర్ల వసూళ్లకు వక్ఫ్‌బోర్డు అధికారుల వత్తాసు

వెంకటాచలం : దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గా గంధ మహోత్సవం ఈ నెల 29వ తేదీన జరగనుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తజనం పోటెత్తుతుంది. మస్తాన్ వలీ 247వ గంధమహోత్సవం ఆదివారం నుంచి మూడు రోజులపాటు జరగనుంది. భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తామని వక్ఫ్‌బోర్డు అధికారులు తరచూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప భక్తులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దర్గా నుంచి ఏటా వక్ఫ్‌బోర్డుకు కోట్ల రుపాయల ఆదాయం సమకూరుతున్నా దర్గా అభివృద్ధికి, భక్తుల వసతి సౌకర్యాలకు మాత్రం ఖర్చు పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బంది, దర్గా ముజావర్లతో కలిసి భక్తుల పట్ల ఇష్టానుసరంగా ప్రవర్తిస్తున్నారని, దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరి స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దర్గా లోపల సీసీ కెమెరాలు ఉన్నా అవి అలంకారప్రాయంగానే ఉంటాయే తప్ప వాటితో ఎటువంటి ప్రయోజనం లేదని, భక్తులపై ముజావర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయడం అసాధ్య మని స్థానికులు పెదవి విరుస్తున్నారు. గంధమహోత్సవం సందర్భంగా ఏటా దర్గా ముజా వర్లు వేలం ద్వారా పెట్టుకొని కొబ్బరి, దుప్పట్లు వంటి వివిధ రకాల వస్తువులను పాడుకుం టారు. ఈసారి ఊహించని విధంగా ఎక్కువ ధరకు పాట వెళ్లింది. అయినా ముజావర్లు వెనుకాముందు ఆలోచించకుండా పాటలు పాడుకున్నారు. ప్రతి ఏటా ముజావర్ల బలవంతపు వసూళ్లతో భక్తులు హైరానా పడుతున్నారు. ఇదంతా తెలిసినా వక్ఫ్‌బోర్డు అధికారులు, సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు.



కసుమూరులోని మస్తాన్ వలీ దర్గా

● కనీస వసతులేవీ!?

గంధమహోత్సవానికి తరలివచ్చే భక్తులు మంచినీరు లేక, పారిశుధ్య వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల ముందే భక్తుల రద్దీ ఉంటుంది. అందుకు అనుగునంగా ఏర్పాట్లు ఉండటం లేదు. ఈసారైనా పటిష్ట ఏర్పాట్లు చేయాలని భక్తజనం కోరుతోంది. అలాగే చెరువు కట్టపై, చందన్ మహల్ వద్ద భక్తులు సేదతీరాల్సిన దుస్థితి నెలకొంది. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో అద్దె గదులు తీసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు రూ.500 ఉంటే గంధమహోత్సవంలో రూ.5వేల నుంచి 7వేల వరకు ఉంటుంది. అద్దెగదులతో పాటు హోటళ్లు, ఇతర దుకాణాల నిర్వాహకులు తినుబండారాలు, శీతల పానీయాలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

● ఆక్రమణలతో ఇబ్బందులు

కసుమూరులో ఆక్రమణల తొలగింపు అధికారులకు సవాల్‌గా మారుతోంది. ప్రధాన రహ దారితోపాటు దర్గాకు వెళ్లే మార్గంలో మొత్తం దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వా హకులు ఒకరిని చూసి ఒకరన్నట్లు పోటాపోటీగా రోడ్డును ఆక్రమించేస్తారు. దీంతో రాకపోకలకు రద్దీ నెలకొని భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతారు. వీటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

బట్వాడిపాళెం నుంచి

రహదారి సుందరీకరణ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 25 : నగరంలోని బట్వాడిపాళెం కూడలి నుంచి డైకస్‌రోడ్డు సెంటరు వరకు రహదారిపై సెంట్రల్ లైటింగ్‌తోపాటు రోడ్డు సుందరీకరణ పనులు నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్‌ఎంసీలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ రహదారి వెంబడి మొక్కలు పెంచడమేకాక వర్షపునీరు బయటకు వెళ్లేందుకు కాలువలు నిర్మించాలని సూచించారు. రహదారిపై నడిచివెళ్లే వారు సేదతీరేందుకు అక్కడక్కడ బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించాలంటూ దిశానిర్దేశం చేశారు. కాగా, నగరంలోని ఆర్టీసీ, కూరగాయల మార్కెట్, పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో రోడ్ల పైనున్న పశువులను ప్రత్యేక వాహనాల్లో ఎక్కించి గోశాలకు తరలించినట్లు వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు25: మండలంలోని జొన్నవాడలో వినాయక చవితి రోజు ప్రతిష్ఠించిన గణనాథుడికి బుధవారం రాత్రి వైభవంగా నిమజ్జనం చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ, వాయిద్యాలు, డీజే సందడి మధ్య యువత ఉత్సాహంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ముందుగా అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం పెన్నాలో గణేశ్ నిమజ్జనం జరిగింది.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

మనుబోలు, సెప్టెంబరు 25: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసింహపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలకు ఆమె హాజరై మాట్లాడుతూ కేంద్రంలో ఇచ్చే బాలామృతం ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, కార్యకర్తలు రేవతి, గౌరి, విజయమ్మ, మహాలక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

ముత్తుకూరు, సెప్టెంబరు 25 : పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ షేక్ మస్తాన్‌సాహెబ్ తెలిపారు. బుధవారం ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నెల్లూరు రెండో డిపో మేనేజర్ ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది ఆధ్వర్యంలో చెత్తాచెదారం తొలగించి బస్టాండ్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రెండో డిపో ఉద్యోగులు మౌలాసాహెబ్, శ్రీనివాసులు, సునీత, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చళ్ల తయారీపై మహిళలకు శిక్షణ

ముత్తుకూరు, సెప్టెంబరు 25 : అదానీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా కృష్ణపట్నం ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అదానీ కృష్ణపట్నం పోర్టు పరిసర గ్రామాల మహిళా సంఘ సభ్యులకు బుధవారం కృష్ణపట్నంలో పచ్చళ్ల తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పొందిన మహిళలు ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటాచలం, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ప్రజా పాలన ప్రారంభమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎగువమిట్ట గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇస్కపాళెం కాలువ, సింగారెడ్డి డ్రైన్ కాలువల దుస్థితిపై సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా దోపిడీ తప్ప మరొకటి కనిపించలేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండదండలతో వైసీపీ నాయకులు మట్టి, గ్రావెల్, ఇసుక, క్వార్ట్జ్ దోచుకున్నారని విమర్శించారు. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువుల్లో 11 లక్షల టన్నులకుపైగా మట్టి, గ్రావెల్ దోపిడి జరిగిందని, ఆ మట్టి, గ్రావెల్ దోపిడిపై విచారణ చేపిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పలువురు ఎన్డీఏ కూటమి నేతలున్నారు.

రాములోరి రథ దహనం బాధాకరం : బీజేపీ



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), సెప్టెంబరు 25 : అనంతపురం జిల్లాలో రాములవారి రథాన్ని తగలబెట్టడం బాధాకరమని, కారకులకు బెయిల్ కూడా రాకుండా కఠినమైన సెక్షన్ల ద్వారా శిక్షించాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ డిమాండ్ చేశారు. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాలను నగరంలోని మూలాపేటలో బుధవారం బీజేపీ కార్యకర్తలు నిర్వహించారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రమేష్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని అగౌరవ పరిచే వారికి హిందూ ధర్మం అంటే భయం కలిగేలా రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లూరు నాగేంద్ర సింగ్, నరేష్ కుమార్ యాదవ్, కృష్ణవేణి పాల్గొన్నారు.



కోవూరు : పండిట్ దీనదయాళ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోవూరు: బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇండ్ల వెంకట రాఘవేంద్రరావు, గాదిరాజు చక్రవర్తి, దోనిపర్తి శ్రీనివాస్, ఐనకోట రఘురామయ్య, పీ రాంబాబు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : ఇందుకూరుపేట బీజేపీ మండల కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గాంధీ, నెల్లూరు శ్రీనివాసులు, అతిపాటి శరత్, మేనాటి రాంబాబు, మేనాటి హరికృష్ణ, దొంతాల మహేష్, నెల్లూరు వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి : వీహెచ్‌పీ



డిప్యూటీ తహసీల్దారుకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 25 : తిరుమల లడ్డును అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు కాశీ నాయన, చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి, అనంతరం డిప్యూటీ తహసీల్దారు శివకృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా పెంచలయ్య, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చింతకింద పెంచలయ్య, బి.పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను

అడ్డుకున్నవారిపై దాడులు

- సర్పంచుతోపాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- అధికార పార్టీలోనే కుమ్ములాట ● పోలీసుల రంగప్రవేశం



రోడ్డుపై అర్ధరాత్రి పరస్పర దాడులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 25: పెనుబల్లిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న పలువురిపై అక్రమార్కులు మంగళవారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఇరు వర్గాలూ టీడీపీకి చెందినవారే. పోలీసుల కథనం మేరకు, జొన్నవాడ పెన్నానదిలో నుంచి అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న జొన్నవాడకు చెందిన ఓ ట్రాక్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి పెనుబల్లి సెంటర్‌లో సర్పంచు ఊడా పెంచలయ్యతోపాటు పలువురు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య జరిగిన వాదులాట జరిగి దాడులకు దారితీసింది. ఈ దాడిలో సర్పంచు, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మరో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు పెనుబల్లికి చేరుకున్నారు. గాయపడిన వారిని 108లో బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఇరు గ్రామాలవారు ముందు మాపై దాడి చేశారంటే.. కాదు.. కాదు.. మాపైనే ముందు దాడి చేశారని చెప్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వివాదాన్ని పరిష్కరించాల్సి ఉంది.

వీధి కుక్కలను నియంత్రించండి

- వైద్యులను ఆదేశించిన మేయర్ స్రవంతి



కుక్కల విభాగాన్ని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 25 : నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన వీధి కుక్కలను నియంత్రించేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటూనే ఉండాలని కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి వైద్యులను ఆదేశించారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయంలోని వెటర్నరీ విభాగాన్ని ఆమె పరిశీలించారు. వీధికుక్కల బెడదపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. నగర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శునకాల సమస్యను పరిష్కరించాలని సూచించారు. కుక్కల బెడదపై ప్రజలు స్థానిక సచివాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు ఎస్‌ఐకి సన్మానం

విడవలూరు, సెప్టెంబరు 25: ఎస్‌ఐగా బాధ్యతలను చేపట్టిన నరేష్‌కుమార్ యాదవ్‌ను బుధవారం అన్నారెడ్డిపాళెం టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్ల గోవర్థన్, బండ్ల సురేష్, సూరగాని గోపి, మడపర్తి చరణ్, మోహన్, దేవ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యలపై వినతులు స్వీకరిస్తున్న సుబ్బారావు తదితరులు

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

- టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 25 : ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. బుధవారం 47వ డివిజన్‌లోని రాజేంద్రనగర్, కుక్కలగుంటలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 100 రోజుల ప్రభుత్వ పాలనపై కరపత్రాలు అందించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్, చెంగయ్య, కల్వకుంట్ల భాస్కర్, కోటపాటి రాజా, అద్దంకి చంద్రశేఖర్, జనసేన నేత కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు ప్రాంత అభివృద్ధే ధ్యేయం

నెల్లూరు నగర తూర్పు ప్రాంత అభివృద్ధే మంత్రి పొంగూరు నారాయణ ధ్యేయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ వెల్లడించారు. బుధవారం 14వ డివిజన్ సచివాలయంలో సభ జరిగింది. ఉచ్చి మాట్లాడుతూ వందరోజుల పాలన జనరంజకంగా ఉందన్నారు. ఇది మంచి ప్రభుత్వమని ప్రజలే చెబుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి మల్లికార్జున, సుభాన్ బాషా, ఎలమందలరెడ్డి, పేట శశిధర్, సుధాకర్‌నాయుడు, గౌషియా. సుగుణమ్మ, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రాల్లో గార్డులు తప్పనిసరి

- నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



బ్యాంకు మేనేజర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

నెల్లూరు (క్రైం), సెప్టెంబర్ 25 : నగరంలోని బ్యాంకు ఏటీఎం కేంద్రాల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డును నియమించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. బ్యాంకు ఏటీఎంల భద్రతపై వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న బ్యాంకు శాఖల మేనేజర్లతో బుధవారం స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఏటీఎంల వద్ద తప్పని సరిగా సెక్యూరిటీ గ్యార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏటీఎంలలో అలారమ్ తప్పనిసరిగా పనిచేసేలా చూడాలన్నారు. రాత్రి వేళ బీటు నిర్వహించే కానిస్టేబుళ్లు ఏటీఎం మిషన్ల వద్ద రిజస్టర్‌లో సంతకాలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



ఆక్రమణలు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు (క్రైం), సెప్టెం బరు 25 : రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వ్యాపారస్తులను హెచ్చరించారు. నగరంలోని పెద్దబజారు ప్రాంతంలోని దుకాణాల ముందు ఆక్రమణలను బుధవారం ఇన్‌స్పెక్టర్ తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు వారి దుకాణాల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని, రోడ్లను ఆక్రమిస్తే సహించేది లేదన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు : చెన్నపల్లిపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ప్రతి గ్రామంలో తిరిగి వరద బాధితుల కోసం రూ. 54,161 సేకరించి పంపినట్లు ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్ తెలిపారు. ఈ సేకరణలో ఉపాధ్యాయులు ఫణికుమార్, విద్యాధరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సహరించినందుకు ధన్యవాదాలు

- విజయ డెయిరీ డైరెక్టర్లు



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రసాద్‌నాయడు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 25 : నెల్లూరు విజయ డెయిరీ ఎన్నికల్లో తాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన టీడీపీ నాయకులకు ధన్యవాదాలని డెయిరీ డైరెక్టర్లు తెలిపారు. బుధవారం వెంకటేశ్వరపురంలోని డెయిరీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. డైరెక్టర్ ఆర్‌వీ ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ మంత్రులు నారాయణ, రామనారాయణ రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు తమకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్ర మంలో డైరెక్టర్లుగా నూతనంగా ఎన్నికైన చంద్రశేఖర్‌రెడ్డి, అన్నం శ్రీహరి, మాజీ డైరెక్టరు బాబునాయుడు, డెయిరీ ఎండీ కృష్ణమోహన్, మాజీ ఎంపీటీసీ అయ్యప్ప పాల్గొన్నారు.

● విడవలూరు : విజయా డైయిరీ డైరెక్టరు అన్నం శ్రీహరి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీడీపీ నాయకులు సింహాద్రి అయ్యప్ప, పెదమాల శేఖర్, పైడిగాని నాగేశ్వర రావు, రాధాకృష్ణయ్య, తాతా శ్రీహరి, తదితరులు ఉన్నారు.

మాగుంట పార్వతమ్మ మృతికి సంతాపం



సంతాప సదస్సులో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 25 : రెడ్‌క్రాస్ మాగుంట సుబ్బరామిరెడ్డి దివ్యాంగుల కేంద్రంలో బుధవారం మాగుంట పార్వతమ్మ మృతికి రెడ్‌క్రాస్ సభ్యులు సంతాపాన్ని వెలిబుచ్చారు. దివ్యాంగుల కేంద్రంలో సమావేశమైన సభ్యులు ఈ కేంద్రానికి మాగుంట కుటుంబం ఎంతో సేవ చేసిందని, అవి మరిచి పోలేనివన్నారు. పార్వతమ్మ మృతికి దివ్యాంగుల కేంద్రం ఉపాధ్యాయులు, పిల్లలు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అభివృద్ధి కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, కార్యాలయ కార్యదర్శి మస్తానయ్య, ప్రిన్సిపాల్ గురునాథరావు, ఏవో చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి

● హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 25 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు కోరారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన యూనియన్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్యులకు పీజీ సీట్ల కేటయింపులో ప్రాధాన్యతను తగ్గించడం సరికాదన్నారు. వెంటనే టైం బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, వరప్రసాద్, సుల్తాన్‌బాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వీఎంఆర్ నగర్‌లో పౌష్టికాహార వారోత్సవం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 25 : నగరంలోని వీఎంఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార వారోత్సవం జరిగింది. సూపర్‌వైజర్ సుజాతమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు.

























● వైసీపీ అధినేతను పలువర్గాలు అడ్డుకునే యత్నం?

● భద్రతా ఏర్పాట్లపై పోలీసు యంత్రాంగం మల్లగుల్లాలు


ఒకే వారంలో ముగ్గురు వీఐపీలు

● తిరుమలకు బాబు, పవన్, జగన్ వరుస పర్యటనలు

తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తోడు లడ్డూ ప్రసాదాల కల్తీ వ్యవహారం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుపతి, తిరుమల వరుస పర్యటనలు తలపెట్టారు. ఒకరి తర్వాత ఒకరుగా.. వారం రోజుల్లో ముగ్గురు కీలక నేతల పర్యటన ఉంది. దీంతో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4న ప్రారంభం కానున్నాయి. తొలిరోజున శ్రీవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించేందుకు సీఎం చంద్రబాబు అదే రోజున తిరుమల రానున్నారు. ఇక శ్రీవారి లడ్డూ కల్తీ వివాదం నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్ష చివరి రోజున తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోనున్నట్టు సమాచారం. ఆయన అక్టోబరు ఒకటిన తిరుపతికి వచ్చి అలిపిరి నడకమార్గంలో తిరుమల వెళతారని, 2న శ్రీవారిని దర్శించుకుని, 3న తిరుపతిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక లడ్డూ వివాదంలో ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుపతి వచ్చి అలిపిరి కాలిబాటలో తిరుమల చేరుకుని 29న శ్రీవారిని దర్శించుకుంటారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

పోలీసులకు తలనొప్పిగా మారనున్న భద్రతా ఏర్పాట్లు

సీఎం చంద్రబాబు తిరుపతి నుంచీ రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించాక వెనుదిరగనున్నారు. సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్ల పరంగా పోలీసు యంత్రాంగానికి పెద్దగా ఇబ్బందేమీ కనిపించడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ పవన్ అలిపిరి కాలిబాటలో వెళితే మాత్రం దారి పొడవునా బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆయనకున్న జనాకర్షణ కారణంగా దారి పొడవునా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాల్సిందే. తిరుమలలోనూ, చివరి రోజు తిరుపతిలో కూడా ఆయన పర్యటనకు బందోబస్తు ఏర్పాటు చేయడం పోలీసులకు కఠిన పరీక్ష కానుంది. ఇక మాజీ సీఎం జగన్ పర్యటన అన్నింటికంటే పోలీసు యంత్రాంగానికి అగ్ని పరీక్షగా మారనుంది. ఎందుకంటే శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీకి ఆయనే కారకుడంటూ పలు రాజకీయ పార్టీలు, హిందూ మత సంస్థలూ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన నడక దారిన వెళితే దారిపొడవునా భద్రత ఏర్పాటు చేయడం ఒక సమస్య అయితే ఆయన్ను పలు పార్టీలు, సంఘాలు, సంస్థలూ అడ్డుకునే అవకాశాలున్నాయి. శ్రీవారి ప్రసాదాలను అపవిత్రం చేసిన వారికి తిరుమల వెళ్లే హక్కు గానీ, శ్రీవారిని దర్శించుకునే హక్కు గానీ లేదని అభ్యంతరపెట్టే అవకాశముంది. ఆయన్ను అడ్డుకునే యత్నాలు శాంతిభద్రతల సమస్యకూ దారితీసే ప్రమాదముంది. ఆ మేరకు పోలీసు యంత్రాంగం భారీ బలగాలను మొహరించాల్సి ఉంటుంది. దీనికి తోడు ముగ్గురు కీలక నేతల పర్యటనలకు విరామం లేకుండా బందోబస్తు విధులు నిర్వర్తించాల్సి ఉండటం పోలీసు యంత్రాంగానికి తలనొప్పిగా మారనుంది.





10 మంది సీఐల బదిలీ

● నలుగురు వీఆర్‌కు రిపోర్టు చేసుకోవాలని డీఐజీ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 25: అనంతపురం రేంజ్ పరిధిలో దాదాపు 16 మంది సీఐలు బదిలీ కాగా అందులో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 10 మంది ఉన్నారు. వీరిలో నలుగురిని వీఆర్‌కు పంపుతూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరూ తక్షణం రిలీవ్ అయి వారి వారి స్థానాల్లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడున్న ఎం.భాస్కరనాయక్‌ను వీఆర్‌కు, ప్రస్తుతం తిరుపతి వీఆర్‌లో ఉన్న పి.శ్రీరాములను డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులను తిరుపతి ఈస్ట్ సర్కిల్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న చిన్న పెద్దయ్యను శ్రీసిటీకి, తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డిని వీఆర్‌కు, డీటీసీ తిరుపతిలోని ఎ.శ్రీరాముడును తిరుమల టూ టౌన్‌కు, అక్కడున్న సత్యనారాయణను వీఆర్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న కృష్ణమోహన్‌ను పూతలపట్టుకు బదిలీ చేశారు. దీంతో జిల్లాలో సీఐల బదిలీలు దాదాపు పూర్తయ్యాయి.

ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్

● తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల కేసుల్లో తాజా పరిణామం


దేవేంద్రకుమార్


తిరుపతి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ స్థానానికి 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతిలో దొంగ ఓటర్లపై నమోదైన కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు తాజాగా సస్పెండయ్యారు. వీరిలో తిరుపతిలోని అలిపిరి సీఐలుగా పనిచేసిన దేవేంద్రకుమార్, అబ్బన్న వుండగా ఎస్‌ఐలలో తిరుపతి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన నాగేంద్ర బాబు, ఎస్వీయూ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన సుమతి వున్నారు. 2021 మార్చిలో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి, బీజేపీ నేత శాంతారెడ్డి పలువురు దొంగ ఓటర్లను పట్టుకుని అలిపిరి స్టేషన్‌లో అప్పగించారు. దీనిపై అప్పటి సీఐ దేవేంద్రకుమార్ క్రైమ్ నంబర్లు 217-2021, 218-2021 పేరిట రెండు కేసులు నమోదు చేశారు. అయితే సక్రమంగా దర్యాప్తు చేయలేదు. ఆయన సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో సీఐగా వచ్చిన అబ్బన్న కూడా సక్రమంగా దర్యాప్తు చేయలేదు. దొంగ ఓటర్లను విచారించడం గానీ, సీసీ ఫుటేజీలను పరిశీలించడం గానీ, ఆధారాలు సేకరించడం గానీ చేయలేదు. రాజకీయ ఒత్తిళ్లతో కేసులు రెండూ మూసివేశారు. ఎన్నికల కమిషన్ గత ఫిబ్రవరిలో ఈ కేసులను తిరగదోడి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈసీ ఆదేశాలతో జరిగిన విచారణలో వీరి నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో తాజాగా ఉన్నతాధికారులు వీరిపై సస్పెన్షన్ వేటు వేసినట్టు సమాచారం. అలాగే ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీబీఆర్ రోడ్డులో దొంగ ఓటర్లు బస్సులో వచ్చి ఓట్లు వేస్తున్నారని అప్పటి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో అప్పటి ఈస్ట్ స్టేషన్ ఎస్‌ఐ నాగేంద్ర బాబు క్రైమ్ నంబరు 180-2021 పేరిట కేసు నమోదు చేశారు. అయితే దర్యాప్తు చేయకుండా కేసును నీరుగార్చేందుకు యత్నించారు. తర్వాత బదిలీపై ఎమ్మార్‌పల్లి వెళ్ళిన ఆయన పది రోజుల క్రితం ఈస్ట్ స్టేషన్‌కు వచ్చారు. ఇపుడు సస్పెండ్ అయ్యారు. అదే విధంగా ఎస్వీయూ స్టేషన్ పరిధిలో దొంగ ఓటర్లు వ్యానులో వచ్చి ఓట్లు వేస్తున్నారని నాటి మున్సిపల్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో యూనివర్శిటీ స్టేషన్‌లో క్రైమ్ నంబరు 65-2021 పేరిట కేసు నమోదయ్యింది. అయితే దర్యాప్తులో అప్పటి ఎస్‌ఐ సుమతి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఈసీ ఆదేశాలతో జరిపిన విచారణలో తేలడంతో తాజాగా ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్ గురించి జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ వెంకట్రావును వివరణ కోరగా ఆయన ధృవీకరించారు.


అబ్బన్న

ఎక్సైజ్ డీసీగా విజయశేఖర్

● తిరుపతి,చిత్తూరు ఈఎస్‌లుగా నాగమల్లేశ్వర రెడ్డి, శ్రీనివాస్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 25:ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న టి. విజయశేఖర్ నియమితులయ్యారు. చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్‌గా తిరుపతి జిల్లాలోని డిస్టలరీ యూనిట్‌లో పనిచేసిన శ్రీనివాసాచారి,తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నెల్లూరులో పనిచేస్తున్న నాగమల్లేశ్వర రెడ్డి,తిరుపతి డిస్టిలరీ అసిస్టెంట్ కమిషనర్‌గా అనంతపురం జిల్లాలో విజిలెన్సు విభాగంలో పనిచేస్తున్న ఎన్. బాలకృష్ణ, చిత్తూరు ఈఎస్‌గా తిరుపతి సెబ్‌లో ఈఎస్‌గా పనిచేసిన శ్రీనివాస్ బదిలీ అయ్యారు.తిరుపతిలో ఈఎస్‌గా పనిచేసిన జానకిరాం ఏపీ బ్రూవరీ కార్పొరేషన్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. చిత్తూరులో ఈఎస్‌గా పనిచేసిన షేక్ ఆయేషాబేగం బ్రూవరేజ్ యూనిట్‌కు డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. వీరంతా త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.గతంలో వైసీపీ ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను సెబ్(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో), ఎక్సైజ్ పేరుతో రెండు భాగాలుగా విభజించిన విషయం తెలిసిందే.అప్పటి ఎక్సైజ్ సిబ్బందిలో 70 శాతం సెబ్‌కు, 30 శాతం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌కు కేటాయించింది. సెబ్‌ను ఏర్పాటు చేసినపుడు డీసీ, ఏసీ పోస్టులను తీసివేసి జిల్లాకు ఒక అధికారిని మాత్రమే నియమించింది.కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను రద్దు చేసింది. ఎక్సైజ్ శాఖలో గతంలో ఉన్న డీసీ, ఏసీ పోస్టులను తిరిగి ఏర్పాటు చేసింది.


విజయశేఖర్

పోలేరమ్మ తల్లో..!

● వెంకటగిరిలో మొదలైన జాతర సంరంభం
● అర్ధరాత్రి తర్వాత కొలువుదీరిన అమ్మవారి ప్రతిమ
● నేడు భక్తుల మొక్కులు.. దర్శనాలు

వెంకటగిరి/ వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరిలో బుధవారం పోలేరమ్మ జాతర సంరంభం మొదలైంది. ప్రతి ఇంటి గుమ్మంలోనూ వేప మండలు కట్టారు. దీంతో పట్టణమంతా పచ్చదనం అలుముకుంది. విద్యుద్దీప కాంతులతో వెంకటగిరి వెలుగులీనింద. ఇక, అమ్మవారి పుట్టింటివారైన కుమ్మరి వారు బుధవారం తెల్లవారుజామున వెంకటగిరి చెరువు నుంచి బంకమట్టి తీసుకొచ్చారు. మధ్యాహ్నం తర్వాత కుమ్మరింట ఆ మట్టిని పసుపుతో కలిపి పోలేరమ్మ ప్రతిమ తయారీ మొదలుపెట్టి.. సాయంత్రానికి పూర్తి చేవారు. ఆ ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా అక్కడే భక్తుల దర్శనార్థం ఉంచారు. అక్కడ్నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకీపై అమ్మవారికి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటికి రాత్రి 9.30- 10.30 గంటల మధ్య తీసుకొచ్చారు. మరోవైపు పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెం చేరడతో ఘటుం కార్యక్రమం ముగిసింది. కాంపాళెం వద్ద అమ్మవారి అప్ప చెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు రాత్రి 11 గంటల సమయంలో పూజలు చేసి అక్కడ పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించి.. గాలిగంగల సారెలను ముగించారు. అక్కడ్నుంచి గాలిగంగలు బయలు దేరి జీనిగలవారి వీధిలోని చాకలింటికి చేరుకుని అమ్మవారి ముందు నిలిపారు. కోడి తలను నోటితో కొరికి అమ్మవారికి కళ్లు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరించారు. తద్వారా అమ్మవారి ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ జరిగి శక్తి స్వరూపంగా సిద్ధమవుతుందని స్థానికుల నమ్మకం. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన సప్పరంపై అమ్మవారిని కూర్చో బెట్టారు. తర్వాత కరెంట్ సరఫరా నిలిపేశారు. దివిటీల వెలుగులు, ఆసాదుల తప్పెట్లు, యువత చిందుల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో గురువారం తెల్లవారుజామున కొలువుదీర్చనున్నారు. బద్దె గొర్రెను బలివ్వడంతో తొలి రోజు జారత ముగిసింది.




అమ్మవారి పుట్టినిల్లు వద్ద పోలేరమ్మ ప్రతిమ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

చిన్నారుల మడిభిక్షాలు



పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. అంటూ పలువురు చిన్నారులు భిక్షాటనచేసి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున నట్టింట గోడపై ఎర్రమటితో అలికి పసుపు కుంకుమలతో అమ్మవారి ప్రతిమను సిద్ధం చేసి పూజలు చేశారు. అమ్మవారి నైవేద్యంగా సిద్ధం చేసిన అంబలి దబరలను.. అలాగే, మడిభిక్షాలను ఎత్తే వెదురు బుట్టలను, స్టీలు గిన్నెలను వేపమండలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. కరవాడు, వంకాయ పులుసును అమ్మవారి ముందు నైవేద్యంగా ఉంచి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఇళ్ల ముంగిట అంబలి దబరలను ఉంచి రోడ్డుపై వచ్చే వారికి అంబలి పోశారు. అనంతరం చిన్నా, పెద్ద, బీదా, ధనిక అన్న తేడా లేకుండా బుట్టలు, గిన్నెలు చేతబట్టి ఇలిల్లూ తిరిగి భిక్షాటన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గతంలో కరువు కాటకాలు వచ్చినప్పుడు భిక్షాటన చేయగా వచ్చిన డబ్బు, బియ్యంతో కొన్ని రోజులు పూట గడుపుకొనేందుకు ఈ ఆచారం పెట్టారని పెద్దలు అంటారు.


అమ్మవారి విద్యుద్దీపాలంకరణ

నేడు పట్టు వస్త్రాల సమర్పణ

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. దీంతో గురువారం నిర్వహించనున్న జాతరలో ప్రభుత్వ ప్రతినిధిగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఉదయం 11గంటలకు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జాతరలో నేడు : గురువారం తెల్లవారుజామున పోలేరమ్మ దేవస్థానం వద్ద కొలువు తీరిన అమ్మవారికి వేయికళ్ల దుత్తలతో మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి ఇంటి ముంగిట జీవాలను బలిస్తారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి విరూపోత్సవం కోసం పూలతో అలంకరించిన రథం నగరినుంచి దేవస్థానం వద్దకు రావడంతో విరూపోత్సవం మొదలవుతుంది. పురవీధుల గుండా మల్లయ్య తోటలోని విరూప మండపం వద్దకు చేరుకోగా.. అమ్మవారి ప్రతిమను కత్తితో నరికి విరూపం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ తంతు అంతా అమ్మవారి ప్రతిమ తయారైన 24 గంటల్లో జరగాలన్నది ఇక్కడి ప్రజల నమ్మకం.

జాతరకు రూ.50లక్షల విడుదల

తిరుపతి(కలెక్టరేట్): వెంకటగిరిలో జరుగుతున్న పోలేరమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.50లక్షలు విడుదల చేసింది. ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ప్రభుత్వంరూ.50లక్షలు విడుదల చేయాలని జీవో జారీ చేసింది.



నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష దరఖాస్తులకు గడువుపెంపు

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు25: జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశానికి ఎంపిక పరీక్షలు దరఖాస్తులను గడువును అక్టోబరు 7వ తేదికి పెంచుతున్నట్లు అన్నమయ్య జిల్లా వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు నవోదయ.జీవోవి.ఇన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాల్లో మార్పులు చేసేందుకు చివరి తేదీ అక్టోబరు 8, 9వ తేదీలలో అవకాశం ఉందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హమ్మయ్య.. గుంతలు పూడుతున్నాయ్!

నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

గూడూరుకు రూ.4.69 కోట్లు మంజూరు

నెల్లూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. కొన్నేళ్ల నుంచి గుంతల రోడ్లతో నరకం అనుభవిస్తున్న ప్రజలకు త్వరలోనే ఉపశమనం లభించనుంది. ప్రజా జీవనంలో కీలకమైన రోడ్లను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం ఐదేళ్లపాటు గుంతలు కూడా పూడ్చలేదు. కూటమి ప్రభుతం అధికారంలోకి రాగానే గుంతల రోడ్లపై దృష్టి పెట్టింది. అత్యవసరంగా చేయాల్సిన పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించింది. అధికారుల ప్రతిపాదనలను ఆమోదిస్తూ వర్షాకాలంలోపు గుంతలు పూడ్చేందుకు రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. కావలి, నెల్లూరు డివిజన్ల పరిధిలోని 170 కిలోమీటర్ల మేర రోడ్లపై ఉన్న గుంతల పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ రోడ్లపై ఏర్పడ్డ భారీ గుంతలను పూడ్చనున్నారు. ఇక గూడూరు డివిజన్‌లోని రోడ్లు కూడా అత్యంత దారుణంగా మారిపోయాయి. గూడూరు - రాజంపేట రోడ్డు, గూడూరు - తూపిలిపాలెం రోడ్డు, గూడూరు - వరగలి రోడ్డు, ఓజిలి - గొల్లపల్లి రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. ఈ డివిజన్‌లోని 14 ప్రధాన రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మరో రూ.4.69 కోట్లు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. అక్టోబరు లోపు టెండర్లతో పాటు అగ్రిమెంట్లు పూర్తిచేసి నవంబరులో గుంతలు పూడ్చే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

షార్‌లో సతీష్ ధావన్ జయంతి



సతీష్ ధావన్ విగ్రహం వద్ద షార్ డైరెక్టర్, ఉద్యోగులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 25: ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సతీష్ ధావన్ జయంతిని బుధవారం షార్‌లో నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా షార్‌లోని మిషన్ కంట్రోలర్ సమీపంలో ఉన్న సతీష్ ధావన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీహరికోటలోని షార్ కేంద్రం ఏర్పాటుకు సతీష్ ధావన్ ఎనలేని కృషి చేశాడని కొనియాడారు. అనంతరం షార్ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 123 మంది రక్తదానం చేశారు. సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్ కేఆర్‌పాలెం ఉన్న సతీష్ ధావన్ మెమోరియల్ హాస్పిటల్‌లో ధావన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు దీనదయాళ్



దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 25: పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆదర్శనీయుడని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు అన్నారు. బుధవారం స్థానిక నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీ నాయుడు, శ్రీనివాసరావు, బిందురెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు రమేష్‌బాబు, కోటారెడ్డి, వెంకటేశ్వర్లు, పరుశురాంసాయి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యాబోధన ఎంతో ఉపయోగకరం



డిజిటల్ విద్యాబోధన చేస్తున్న ఎంఈవో మల్లికార్జున్‌రావు

తడ, సెప్టెంబరు 25: డిజిటల్ విద్యాబోధన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఎన్నో విషయాలను సొంతంగా నేర్చుకోవచ్చని ఎంఈవో మల్లికార్జున్‌రావు తెలిపారు. బుధవారం కారిజాత ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ విద్యపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఎఫ్‌పీ ప్యానల్‌లను ప్రతి పాఠశాలలో వినియోగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించుకోవాలి



ఒరియంటేషన్ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది

గూడూరు, సెప్టెంబరు 25: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి సాధించుకోవాలని నెల్లూరు ఎంజీ బ్రదర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతుల నుంచి పరిశ్రమలు ఆధునీ కరణ వైపు కదులుతున్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను, సృజనాత్మ కతను పెంపొందించుకుని చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ దత్తాత్రేయశర్మ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్

కోట, సెప్టెంబరు 25: కోటలోని అల్లారెడ్డి వెంకట కృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ బుధవారం ముగిశాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి 75 పాఠశాలలకు చెందిన 700మంది పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంఈవో మస్తానయ్య, శైలజ అభినందించారు.

28న నెల్లూరులో అథ్లెటిక్స్

కోట, సెప్టెంబరు 25: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 28వ తేదీన అండర్ 19 విభాగంలోని బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శ్రీరేష్ తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే బాలబాలికలు 10వ తరగతి ఒరిజనల్ మార్కులలిస్టుతో హాజరుకావాలని కోరారు. 1-1-2006 తరువాత జన్మించిన వారు మాత్రమే ఈ క్రీడలకు అర్హులని అన్నారు.

సీఎంను కలసిన బొమ్మన శ్రీధర్



తడ, సెప్టెంబరు 25: రాష్ట్ర మత్స్యకార సంఘం తరఫున రూ.15 లక్షల చెక్కును సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రత్యేకంగా కలిశారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

వాకాడు, సెప్టెంబరు 25: మండలంలోని వల్లమేడు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వేణుగోపాలపురం ఉపాధ్యాయిని సుభాషిణి, పంబలి ఉపాధ్యాయిని సుష్మా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. బుధవారం వారిని ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, మస్తానయ్య, మాల్యాద్రి, శ్రీనివాసరావు, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

గూడూరు, సెప్టెంబరు 25: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెతలలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఆర్థికసాయం అందజేయాలన్నారు.

మల్లాంలో పోషకాహార మాసోత్సవాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 25: మండల పరిధిలోని మల్లాంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కోట ప్రాజెక్టు సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ... రక్తహీనతను అరికట్టాలంటే ఆహారంలో ఐరన్, కాల్షియం, మినరల్, విటమిన్స్ పదార్థాలను తినాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తక్కువ కర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే మునగాకు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు.

డ్రాయింగ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: డ్రాయింగ్ పరీక్షల్లో చెన్నూరు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటినట్లు ప్రిన్సిపాల్ మధుసూదనబాబు బుధవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెలలో నిర్వహించి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షల్లో డ్రాయింగ్ లోయర్ విభాగంలో తమ పాఠశాలకు చెందిన మహేంద్ర, దినేష్, పవన్, జీ.దినేష్, హయ్యర్ విభాగంలో ప్రణయ్‌తేజ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కుల అందజేత

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి బుధవారం పలువురు చెక్కులను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కి అందజేశారు. కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన దువ్వూరు జనార్ధన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి రూ.లక్ష, టీడీపీ నాయకులు బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఆరికట్ల మస్తాన్‌నాయుడు రూ.లక్ష చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ తెలిపారు.

దుస్తుల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు దుస్తులు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 25: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక బీసీ కాలనీ సమీపంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం పీకల్లోతు అప్పుల్లోకి నెట్టేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను సీఎం చంద్రబాబు అధిగమిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. మూడు వేల పింఛను నాలుగువేలకు పెంచి ప్రతినెలా ఒకటో తేదీనాడు ఇంటికి వద్దకే లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. పేదలకు మూడు పూటలా కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న దీపావళి పండుగ నుంచి మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు అందజేసే పథకాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డనిధి పథకం ద్వారా నెలకు రూ.1500 అందజేయడం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర పథకాలను త్వరలోనే సీఎం ప్రారంభిస్తారని వివరించారు. అనుకోని విపత్తుల కారణంగా విజయవాడలో సంభవించిన వరదలకు నష్టపోయిన వారికి మునుపెన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తోందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న మంచి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం చెన్నూరు గ్రామానికి చెందిన బాలశంకర్, స్థానిక 7వ వార్డుకు చెందిన మంజులకు ఎమ్మెల్యే సొంత నిధులతో ట్రైసైకిళ్లను అందజేశారు. బాలింతలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, అబ్దుల్ రహీమ్, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్‌కుమార్, కరుణాకర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి, మట్టం శ్రావణి, చంద్రనీల్, నరసింహులు, శ్రీదేవి, రాఘవరెడ్డి, నటశేఖర్, బత్తిన ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం పెళ్లకూరు మండలంలోని పునబాక గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీమంత్రి పరసా రత్నం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయ భాస్కర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వం పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ నిర్వాహకం వల్ల రూ.11 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన అపారమైన అనుభవమే పెట్టుబడిగా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేశారన్నారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సమప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పింఛన్ల పెంపు, డీఎస్సీ ప్రకటన స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు మంజూరు వంటి చర్యలు తీసుకుని ప్రజలకు సంతృప్తికర పాలన అందిస్తున్నారు. మాజీమంత్రి పరసా రత్నం మాట్లాడుతూ సేవాభావం కలిగిన సీఎం చంద్రబాబు 74ఏళ్ల వయసులో కూడా వెనుకంజ వేయకుండా విజయవాడ వరదల్లో బాధితులను ఆదుకునేందుకు ఆయన చూపిన చొరవ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్ధరాత్రుల్లో ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లలో ప్రయాణించి బాధితులకు అండంగా నిలిచారని కొనియాడారు. ఇలాంటి నాయకుడు రాష్ట్రానికి శాశ్వత సీఎంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వర్ ఏడుకొండలు, నాయకులు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఎద్దల నరేంద్రరెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి, పేరం రమేష్‌నాయుడు, రాజగోపాల్‌రెడ్డి, శివకుమార్, పాలచ్చూరు సుబ్బరామయ్య, పార్థసారథి, శేఖర్‌నాయుడు, కృష్ణమనాయుడు, మురళీనాయుడు, గోపాల్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, సిద్దులయ్య నాయుడు, హరినాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, వెంపళ్ల వెంకటేశ్వర్లు, గంగాబత్తిన రామకృష్ణ, కేవీ నాయుడు, ప్రసాద్‌నాయుడు, మోహన్‌నాయుడు, అక్కరపల్లి మాధవ రెడ్డి కాటంరెడ్డి మల్లికార్జునరెడ్డి, రాకేష్‌రెడ్డి, పోలయ్య, బెన్నీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధి విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 25: బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ తెలిపారు. బుధవారం మండలంలోని అన్నమేడు, పుదూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధి చేయడం వల్ల కలిగే లాభాలను, బీజామృతం ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: మండలంలోని వెందోడు, కాంద్ర గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేసుకుని, అందుకు అనుగుణంగా ఎరువులను వాడుకోవాలన్నారు. సాగులో మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి కార్తీక్, పశువైద్యుడు సుదర్శన్, వెంకటేశ్వర్లురాజు, చక్రి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని వంజివాక, కొక్కుపాడు, రైతు సేవా కేంద్రాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు పంటలసాగు, దిగుబడులపై అవగాహన కల్పించారు. వరిపైర్లకు చీడపీడలు సోకడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

సూళ్లూరుపేట: రైతులు పంటల సాగులో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే అధిక దిగుబడులలు సాధించవచ్చునని ఏవో కవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుద్ధమడుగు తాగేలి, మంగానెల్లూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకురాలు శ్రావణి, వెంకటేశ్వర్లు, కవిత తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారిణి గీత అన్నారు. మండలంలోని రావిగుంటపాళెం, వల్లమేడు పంచాయతీలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసిన నేపథ్యంలో కిలో వరి విత్తనాలకు ఒక గ్రాము కార్బనైజం లీటరు నీటితో కలిపిన ద్రావణంతో ఒక రోజు నానపెట్టి నారుమడిలో చల్లడం వల్ల అగ్గితెగులు, ఆకుమచ్చ, పొడ తెగుళ్లను అదుపు చేయవచ్చన్నారు. భూసార పరీక్షలు, నీటి యాజమాన్యం కలుపు నివారణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తీపలపూడి రమణయ్య, ఇంగిలాల బుజగేంద్ర, విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చీదరించుకున్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదు: నెలవల



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, సెప్టెంబరు 25: ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరుతో విసిగిపోయిన ప్రజలు గత ఎన్నికల్లో చీదరించుకుని కేవలం 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పునబాక సచివాలయ ఆవరణలో ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీమంత్రి పరసా రత్నంతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులు ఇంకా వారే అధికారంలో ఉన్నట్లుగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ కుటుంబంపై ఎంతో నమ్మకంతో తన కుమార్తెకు ఆశీర్వదించి గెలిపించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. అలాగే నాయకులకు, కార్యకర్తలకు తమ కుటుంబం అండంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో వేణుంబాక మునిరామయ్య, ప్రసాద్‌రెడ్డి, కిలారి గోపీ, గోళ్ల చంద్రశేఖర్‌యాదవ్, కురిమేటి ఉదయ్ కుమార్, నరేంద్ర, రవి నాయుడు, గంగాబత్తిన గురవయ్య, సురేష్ నాయుడు, రవినాయుడు, ప్రసాద్ యాదవ్, బడికాల శ్రీనివాస్, కాంద్ర రమణయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన సీసీలకు పోస్టింగులు ఇవ్వాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 25: వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి వెలుగు కార్యాలయంలో సీసీలుగా పనిచేస్తున్న సునీత, మంజులను సస్పెండ్ చేయడం దారుణమని రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. దళిత ఉద్యోగులైన మంజుల, సునీతను ఎటువంటి కారణాలు లేకుండా తొలగించారని, వెంటనే వారికి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 25: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు పోలీసులను ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పోలేరమ్మ అమ్మవారి గుడి, కుమ్మరి ఇళ్లు, సాకలి ఇళ్లు, రాజావీధి, పాత బస్టాండ్ ప్రాంతాలను పరిశీలించారు. క్యూలైనులో భక్తుల తోపులాట లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ కంట్రోల్ పాయింట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీవీఐపీలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు, వారి వాహనాలు పార్కింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి జాతరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వస్తున్నారని బందోబస్తుతో అమ్మవారి దర్శనం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీ రమణ కుమార్, సీఐ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు.



పూలతో అమ్మవారి ముఖం

అన్నిదారులూ వెంకటగిరి వైపే

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా మొదలైంది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం, అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో వెంకటగిరి పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. పట్టణంలో అడుగడుగున ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ట్రాఫిక్ ఆంక్షలు గురువారం మరింత పటిష్టం చేయనున్నారు.

ఏరులైపారుతున్న మద్యం

పట్టణంలో మంగళవారం రాత్రి నుంచే మద్యం అమ్మకాలు నిలిపివేసినా ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబుల ఆగడాలు శృతిమించి పోయాయి. తమిళనాడు, బెంగళూరు, హైదరాబాద్ నుంచి మద్యం అక్రమంగా వెంకటగిరి పట్టణంలోకి ప్రవేశిస్తున్నట్లు తెలిసింది. మద్యం నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు నామమాత్రంగా మారాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.







అమ్మవారి ఆలయం ఎదుట పూల అలంకరణ - వెయ్యికళ్ల దుద్దలతో కళాకారుల నృత్య ప్రదర్శన - విద్యుత్ దీపాలతో రాజావీధి అమ్మవారి ఆర్చి సెంటర్